అనంతపురం



భూమిక

సాగుతున్న చిత్రంలాగే చూడవచ్చిన జనం కూడా జోగుతున్నారు. గాలివిసురుకు సినిమా డేరా, అందులో తెరాకూడా ఊగుతున్నాయి.

తెరమీద మాళవరాజకుమారుడు వేటకెళ్ళి విల్లెక్కుపెట్టి బాణం వేశాడు. అది సూటిగా అమెరికావెళ్లి అక్కడి అడవిలోని పులికి తగిలే సరికి ఆ దెబ్బకి ఆఫ్రికాలోని సింహం భయంకరంగా గర్జించింది. దాంతో ఆ చుట్టుపక్కల జింకలూ, జిరాఫీలూ, ఇండియాలోని కుందేళ్లూ, మళ్ళీ ఆఫ్రికాలోని సింహాలూ, కారెనుములూ కంగారుపడి పరుగెత్తాయి.

అంతలోకే అమెరికాలో కారుమబ్బులు అలముకున్నాయి. ఇందాకట ఆఫ్రికన్ సింహం తమని కాపీకొట్టినట్టు గర్జించిందన్న కసికొద్దీ ఈ పర్జన్యాలు సింహంలా గర్జించి ఊరుకున్నాయి.

"డైరెక్టరు పప్పులో కాలేశాడు" అన్నాడు వరహాలరాజు తక్షణం గంభీరంగా చూచి.

అతగాడి జతగాడు ఏం అని అడగలేదు. ఎందుకంటే రాజుకెంత తెలుసో ఇతనికీ అంత తెలుసు. అడగడం చిన్నతనం. అయినా అతనికేం తెలీదని రాజుకి గట్టి నమ్మకం. మొహమాట పడుతున్నాడనుకుని జాలి తలచి కిటుకు చెప్పేశాడు హడావుడిగా. "సింహం మేహంలాఅరచింది".

"తెలుసులేవోయ్ సింఘం సేహంలాకూడా అర్చింది. నేను ఫస్టు సారే కనిపెట్టేశానులే" అన్నాడు అతనిమిత్రుడు అంతకన్న చురుకుగా.

రాజు మాటాడలేదు. శ్రద్ధగా సినిమాచూస్తూ 'హీరోయాక్షను' ఒక్కటే 'ష్టడీ' చేస్తున్నాడు.

ఈచిత్రం అతను చూడ్డం ఇంకా ఒకసారికూడా పూర్తికాలేదు. అతనెపుడూ మొదటిసారి హీరోని చూసేసి, తరువాతసారి విలన్నీ, రేలంగినీ ష్టడీచేసి, మూడోసారినుంచి, మ్యూజిక్కు, సంభాషణలు సంతృప్తికరంగా, రసవంతంగా ఉన్నాయో లేదో, డైరెక్షను చప్పగా ఉందో లేదో, సౌండు ఫరవాలేదో అవునో పరిశీలిస్తాడు. అప్పుడప్పుడు మాత్రం చిన్న విమర్శలు చేస్తాడు.

ఈ సారిమాత్రం, కూడావచ్చిన మిత్రుడు ముత్యం కొంచెం చిన్న యాక్టర్లని కూడా ఓకంట కనిపెట్టాలని పోరి మరీ టిక్కెట్టు కొన్నాడు. హీరోయాక్టింగు కిటుకులన్నీ తెలిసిపోయినా సినిమావాళ్లు ఓపట్టాన నమ్మరుట. ముందర చిన్నవేషాలు వేసే తీరాలంటారుట అందుకని.

"ఇదో గురూ ఇపుడీసీనులో ఓ 'ఎక్స్ట్రా' గాడొస్తాడు చూడు నారంగా.... ....యేమి యాక్షను చేశాడురా నాయనా! వాడెవడో తెలుసా? ఇదివరకు ద్వారపూడి సంతదగ్గిర లాట్రీ నడిపేవాడూ—వాడే. హఠాత్తుగా పరారైపోయి, మళ్ళీ యిక్కడ కనబడ్డాడు. ఇట్టై దూరిపోయాడురా! చిత్రం" అన్నాడు ముత్యం.

మేఘగర్జన మళ్ళీ వినపడింది.

"వాలొస్తోర్ది" అన్నాడు రాజు బద్ధకల్గా ఆవళిస్తూ.

"నీ బొంద. అది బైటవాన. నిజం పిడుగు. తరవాత సీనులో గాని సినిమాలో వానరాదులే. ఇప్పుడే మనవాడు వస్తాడు. వచ్చి భయపడ్డట్టు ఫేసుమీద ఓ ఎక్స్ప్రెషను పెట్టేసి ఒక యాక్షన్ చేస్తాడు చూడు నారంగా—"

ఇంతలోకే తెరమీదకి చిన్న హాస్యగాడు వచ్చేసి ఆఫ్రికా సింహగర్జన విని భయపడ్డట్టు "ఫేసుమీద ఓ ఎక్స్ప్రెషన్" పెట్టేసి ఊహూ యాక్షన్ చేసెయ్యడం మొదలుపెట్టాడు.

"ఓవరాక్షన్ కదూ?" అన్నాడు రాజు గంభీరంగా.

"హుఁ, నీకేంతెల్సు గురూ. ఒక్కోసారి ఓవర్ చెయ్యకపోతే లాభం లేదట. మన్ననలు ఎవడూ చూడ్డు. ఇపుడు మనం చూసేవాళ్ళమా చెప్పు. అందికే మన ఆచారి యాక్షనుమీద రాసిన బుక్కులో ఏంరాశాడు?

చవట వేషమైన, జడ్జివేషమ్మైన,
నవధి తక్కువైన, నతివయున్న
టట్టటాటటాట టాటటాటాటటా
డోసుమీరవచ్చు డోకురాదు."

అని గర్వంగా చుట్టూ పరకాయించాడు ముత్యం.

హాలులో ఉన్న మిగతా యాభైయిద్దరూ సినిమా చూస్తున్నందు వల్ల ముత్యాన్ని ఎవరూ చూడలేదు.

అందరూ మత్తుగా జోగుతున్నారు. రాజులాంటి నిశిత విమర్శకులు, కాదలచుకున్న హీరోలూ మాత్రం ఓపిగ్గా చూస్తున్నారు.

రాజు పరిభాష ప్రకారం "తెరమీద కొసరుతారడు" తెగ నటించేస్తున్నాడు.

తెరమీద మబ్బులూ డేరామీద మబ్బులూ కూడా గర్జిస్తున్నాయి....

గాలి రివ్వున వీస్తోంది .... పెద్ద పిడుగు పడింది .... తెరమీద నటుడు హఠాత్తుగా కాలు తొట్రుపడి, కొండమీంచి తూలి, తెరలోంచి ఊడి దభేలున నేల టిక్కెట్టు జనాభా మధ్య పడ్డాడు.

ఒక్కసారిగా మహారాజ పోషకుల మధ్య కలకలం చెలరేగింది. "సినిమావోడు ఊడిపడి పోనాడేస్" అన్న కేకలు చెలరేగి పోయాయి.

రాజు, ముత్తెం, తదితరులూ ఆ చిన్నవాడిని చుట్టుముట్టారు.

అతడు మెల్లిగా కళ్లుతెరిచి, లేచి చుట్టూ చూసి, చట్ట విరిగేలా ఆశ్చర్యపడిపోయి, మళ్ళీ లేచి 'నేనెక్కడున్నాను?' అన్నాడు.

"మొవ్వారం ఆటు సినిమాలో" అన్నారెవరో సగౌరవంగా.

"ఇది కోడంబాకం కాదా? మాంబళం కాదా. సీ ఫ్లోరు కాదా" అన్నాడు నటుడు.

బోధపడక ఎవరూ జవాబివ్వలేదు.

"మనమాటే కాదేస్ .... మనమాటాకాదు, ... మన బాసా కాదనిపిస్తది .... అసలాడు మడిసి కాదు గందా. సినిమా బొమ్మమరి. అందులోనే ఉంటేనే ఊసులు సోగ్గా ఉంతాయి. ఊడిపడితే యింకేటుంటది. పాణమా పాడా" అన్నాడొక ముసలయ్య మెల్లిగా.

"ఆణి ముట్టుకునేవు బుల్లోడా. సినిమా ఎల్ట్రీకరింటు షాకిత్తాది," అన్నాడెవరో.

ఇలా అయితే లాభం లేదనుకున్నాడు రాజు. వెంటనే ఓ సోడా తెప్పించి ఇచ్చాడు పడిపోయిన నటుడికి. అయ్యా మీ పేరేమిటి? తమరు నటులా, బొమ్మలా? అన్నాడు.

"దుక్కలా నిలబడుంటే బొమ్మంటావేమిటోయ్ బైతులాగ. నేను వర్ధమాన నటుణ్ణి. నాపేర్ 'శ్రీకుమార్'" అన్నాడు — నటుడు

దేరాపై కప్పు వేపు ఫొటోజెనిక్‌గా చూస్తూ.

"ఓః మీరా." అన్నాడు రాజు శ్రీకుమార్ ప్రొఫైల్ గుర్తుపట్టి. "ఇలావచ్చారేం?"

"మహాశయ్యా! మీరిపుడు ఎనిమిది సినిమాలలో నటిస్తున్నారని నేనూ కాదని రాజూ వాదించుకుంటున్నాము. మీ రెవరితో ఏకీభవిస్తా రెడిటర్జీ?" అన్నాడు అప్పటికి పరిస్థితిని అర్థంచేసుకుని పుంజుకున్న ముత్యం.

"జ్ఞాపకం లేదు" అన్నాడు శ్రీకుమార్ తలకాయని ప్రొఫైలు లోంచి ఫుల్‌వ్యూకు 'పాన్' చేస్తూ.

"మా ముత్యానికి సినిమాలలో చేరాలని ఉబలాటం అండి. మీరెలాగా వచ్చారు కాబట్టి కాస్త వీణ్ణి మీతో తీసుకెళ్ళ—"

"అబ్బే నాదేముంది కాని, మా రాజూ ఎన్. టి. రామారావుని, ఫస్టుగా ఇమిటేటు చేసి పారేస్తాడండి. వీణ్ణి తీసికెళ్ళి ఆయనకి చూపిస్తే ఎగిరి గంతేసి బుక్ చేస్తారు." అన్నాడు ముత్యం వినమ్రత ఉట్టి పడేలా.

"బాగుంది కాని, నేను ఇప్పుడు అర్జెంటుగా మెడ్రాసెళ్ళాలంటే రైలుచార్జీలుకూడా లేవుగదా. అసలంతకన్న అర్జెంటు ఇపుడీ ఫిలింలో ఖాళీ నింపకపోతే రేపు షో ఎలా? ప్రొడ్యూసరేమనుకుంటాడు? రైలు చార్జీల్లేకుండా మెడ్రాసునుంచి ఈ వూరొచ్చి ఇక్కడ చల్లగా జారిపోయా ననుకుంటాడు. తప్పుకాదూ? అసలదీకాక నాకీ వెధవ పల్లెటూళ్ళో ఏంతోచటంలేదు. తక్షణం మళ్ళీ ఫిలిములోకి వెళ్ళిపోవాలి. ఎలా?" అన్నాడు శ్రీకుమార్ గుక్క తిప్పుకోకుండా.

అందరూ ముగ్ధులైపోయారు అతని వాగ్ధాటికి.

'మరి ఎలా ఎక్కుతారు' అన్నాడు ముత్యం.

'దానికేముంది సినిమా మళ్ళీ వేస్తేసరి, ఈయన ఊడిపోయినచోట

ఖాళీవుంటుందిగా. అది రాగానే గబుక్కుని ఎక్కిపోతాడు. అంతే. అసలు సినిమాలు అలాగే తీస్తారులే. మహాబలిపురంలో షూటింగుతీసి స్టుడియోలో యాక్టర్లని మళ్ళీ వేరే షూటింగుతీసి ఆనక రెండూ కలిపేస్తారు. ఉందిలే పద్ధతి" అన్నాడు రాజు మళ్ళీ గంభీరంగానే.

"ఒరేయి ఈయన ఎలాగావచ్చాడు. సన్మానంచేసి రేపు పంపేద్దాం" అన్నాడు ముత్యం.

"లాభంలేదు" అన్నాడు శ్రీకుమార్.

చివరికి మళ్ళీ సినిమా వేశారు.

తెరమీద మబ్బులూ, డేరా అవతల మబ్బులూ కూడా ఉరుము తున్నాయి.... గాలి రివ్వున వీస్తోంది.... శ్రీకుమార్ స్టేజిమీద రెడీగా నిల్చున్నాడు. రాజూ, ముత్యం, పక్క నిలబడ్డారు.

తెరమీద శ్రీకుమార్ నటించిన "కాశీచోటు" వచ్చేసింది.

బయట పెద్ద పిడుగు పడింది.... ఆ హడావుడిలో శ్రీకుమార్ తెరమీద ఖాళీలోకి దూకాడు. ముత్యం, రాజూ అతన్ని అందులోకి తోసేసి చేతులు దులుపుకు చక్కావచ్చి యధాస్థానంలో కూర్చున్నారు.

"బలేగా ఎక్కిపోయాడురా. మనంకూడా వాడితో పాటే దూరిపోతే బాగుండేది. మెడ్రాసులో ఎవడి చుట్టూరా తిరక్కుండానే హీరోలై పోయేవాళ్ళం" అన్నాడు రాజు, జరిగిన గమ్మత్తు మత్తులో అర్ధనిమీలిత నేత్రుడై.

"అరటిక్కెట్టు కొనుక్కు రావలసింది అలా సగం కళ్లుమూసుగు చూసేకాడికి. వెధవబడాయీ నువ్వూను. ఈలోగా నీబోడి పోజుని ఎవడూ ఫొటో తియ్యడులే. తీసినా చీకట్లో అది షూట్ కాదు. పూర్తిగా కళ్లు తెర్చిచూడు" అని మందలించాడు ముత్యం.

తెరమీద తుపాను చల్లారింది. తరువాతి దృశ్యంలో తెల్లారింది....

....తెల్లారింది. కవికన్న మిన్న అన్న పేరు తెచ్చుకోవాలన్న ఉత్సాహంతో సూర్యభగవానుడు కాంతికిరణాలను మూలమూలకి ప్రసరించి చూస్తున్నాడు. బద్ధకిష్టులను నిద్రలేపుతున్నాడు. ఒక కొంటి కిరణం శివాలయం అవతల ఉన్న పెంకుటింటి వీధరుగు మీది తడకవసారాలోకి ప్రవేశించింది. అక్కడ రాజు బద్ధకంగా నిద్రపోతున్నాడు. తడకని తాకి, దాని అవతలఉన్న 'తారామండలాన్ని' ఛేదించి లోపలికొచ్చిన ఆ కిరణం రాజు కుడికంటి రెప్పమీద సూటిగా దిగి ఘాటుగా పొడిచింది. లేలే అంది.

రాజు ఆవులించి, మెల్లిగా కళ్ళుతెరచి, తడకమీద అంటించుకున్న 'తెరవేలుపు'ల వదనారవిందాలు చూచి ఆనందించి, మళ్ళీ కళ్ళు మూసుకుని, అరచేతిలో 'నర్గీస్' చుట్టుకొని కళ్ళకద్దుకుని, కళ్ళుతెరచి ఫొటోజెనిక్‌గా ఆవలించి, 'హాయ్‌రాజ్' అనుకున్నాడు.

అతనిదృష్టి తడకమీద నిలచింది. ఊహలు రెక్కలు విప్పి ఎగిరాయి....రాజకపూర్ ఇపుడు టీ తాగుతూ ఉంటాడు. దిలీప్‌కుమార్ దిగాలుగా చూస్తూ ఏ కిటికి వెనకో నిలచి ఫొటో తీయించుకుంటూ ఉంటాడు. నర్గీస్ బొమ్మలతో ఆడుకుంటూ ఉంటుంది. నాగేశ్వరరావు ఈపాటికల్లా మేకప్ చేసుకొని సెట్‌మీదకి వెళ్ళి ఉంటాడు. యన్. టి. రామారావు మాంఛి టీ తాగి స్టుడియోకి వెళ్లుంటాడు. రేలంగి ఆసినీబందపడ అని ఎవరో ఒకర్ని ఏడిపిస్తూ ఉంటాడు. జమున శరత్ పుస్తకం చదువుతూ ఉంటుంది. ఎస్. వరలక్ష్మి పువ్వులు కోస్తూఉంటుంది. అంజలీ డాన్సు నేర్చుకుంటూ ఉంటుంది. భానుమతి త్యాగరాజ కీర్తనలు పాడుకుంటూ ఉంటుంది. సావిత్రి కథల బుక్కు చదువుతూ ఉంటుంది. హాబ్బ....బలే వుంటుంది. సినిమా స్టార్ లైఫ్ అనుకున్నాడు రాజు ఇంగ్లీషులో.

'కాస్తలో తప్పిపోయిందిగదా ఛాన్సు' అనుకున్నాడు కాసేపాగి. ఆ ఊహ రాగానే ఉలికిపడి లేచి కూచున్నాడు.

రాత్రి సినిమాలోంచి ఎవడో ఊడి పడిపోయాడుగదా, అప్పుడు మళ్ళీ సినిమావేసి వాడు ఊడిపోయినచోటు రాగానే గబుక్కున అందులోకి ఎక్కించేశారు గదా. చిత్రంగా ఉందే—అలా ఎలా ఊడిపోతారు. ఒకవేళ ఊడినా మళ్ళీ ఎలా ఎక్కుతారు? ఇంపాసిబుల్ కలేమో అనుకున్నాడు రాజు.

అతనికి హఠాత్తుగా అనుమానం వచ్చింది.

అసలు తను రాత్రి సినిమాకెళ్ళాడా?అని.

సినిమాకెళ్ళినట్టూ అక్కడే గారడీ జరిగినట్టు కలొచ్చిందా? అసలు రెండూ జరిగాయా? రెండు జరగలేదా. మతి ఉందా పోయిందా?....

"ఒరే అబ్బీ నీకు మతుందా పోయిందా?రైలుకి వేళైంది అలా నల్లమందు భాయిలా కూచుంటావేం. లే లే" అన్నాడు రాజు జతగాడు ముత్తెం లోపలికొచ్చి.

"ఎక్కడికి?" అన్నాడు రాజు.

"బావుందిరా అబ్బీ మెడ్రాసెళ్తానన్నావు గదరా? సైకిలమ్మేశావు. అప్పుచేశావు. ఇంతా చేసి ప్లాను మార్చావా?" అన్నాడు ముత్యం.

"అబ్బే లేదు లేదు. ఔనుగాని మనం రాత్రి ఏ సినిమాకెళ్ళాం?" అన్నాడు రాజు.

"ఇంక లాభంలేదు. నువు మెడ్రాసెళ్ళకు. విశాఖపట్నం టిక్కెట్టు కొను. అలా అయితే మీ తాతకి చెప్పేవెళ్ళొచ్చు" అన్నాడు ముత్యం నవ్వుతూ.

"అయితే రాత్రి మనం ఎక్కడున్నాం?"

"ఏమిటోయ్ ఏం డిటెక్టింగు మొదలెట్టావేమిటి యాక్టింగు వదిలేసి. లేలే, మీతాత పొలంనించి వచ్చేస్తే కథ అడ్డం తిరుగుతుంది." అన్నాడు ముత్యం హడావుడిగా.

రాత్రి జరిగింది కలా? కల్లా? అన్నాడు రాజు లేస్తూ.

"దైలాగు అనడానికి బాగుంది గాని రెండూ ఒకటే. అదే సినిమాలో వస్తే, రచయిత పప్పులో కాలేశాడు అంటావు నువ్వే, నడు నడు."

రాజు ఇంక మాట్లాడలేదు.

గబగబా మొహం కడుక్కుని, తరవాణీ అన్నం తినేసి, ఓ చిన్న పెట్టెలో సినిమా పత్రికలూ, తను రాసిన సినిమా కథలూ, సినేరియోలు, విమర్శలూ, పాటలూ, పాటల పుస్తకాలూ అన్నీ పదిలంగా సర్దేసుకుని, ఇపుడే వస్తాను బామ్మా అని చెప్పి రైలుస్టేషనుకు దారితీశాడు.

దారిలో జంకుతూనే, రాత్రిసంగతి మళ్ళీ కదలేశాడు. అది కలో, నిజమో బోధపడ లేదతనికి ఇంకా.

"ఒరేయ్ రాజా నువ్వింకా పెద్దస్టారువి కాకుండానే ఇలాటి బడాయిలు పోబోకు నాకు ఒళ్లుమండుతుంది. నువ్వు గొప్పవాడివై పత్రికలవాళ్లు ఇంటర్వ్యూ చేసినపుడు మరుపూ గిరుపూ చెలాయించు ఇపుడు కాదు." అన్నాడు ముత్యం.

రైలు కదిలే వేళైంది.

"జాగర్త రాజా ఎలానెగ్గుకొస్తావో — మెద్రాసంటే పట్టపగలు టోకరా యిస్తారట. మూరుమార్కెట్టులో ఏమీ కొనకు. రిక్షావాళ్ళతో మాట్లాడకు. అరవం గబగబ నేర్చుకో, సర్టిఫికెట్లు జాగర్త." అని హెచ్చరించాడు ముత్యం.

రాజుకి కంటనీరు తిరిగింది.

"కొంచెం భయంగానేఉంది గురూ. నిన్ను రమ్మంటే

రానంటావుఎలా." ముత్యం మాట్లాడలేదు. ఆలోచిస్తూ నిలబడిపోయాడు. గార్డు ఈలవేశాడు.

హఠాత్తుగా ముత్యం తెగించి ఒక నిర్ణయం చేశాడు.

"గురూ. పోతే పోయిందిగాని, 'వానపాము' నాటకంలో కూడా హీరో రోలు నువ్వే వేశానని చెప్పేయి డైరెక్టర్లతో. అదికూడ కలిపితే అరడజను నాటకాలు అవుతాయి." అన్నాడు.

రాజుకి నోటమాట రాలేదు. ఆశ్చర్య సంభ్రమాలవల్ల. ఐనా ప్రయత్నించాడు. "ఇంత త్యాగం చేస్తున్నావా గురూ! నీకీర్తి శాశ్వతంగా—"

"గురూ అది హెవీ డైలాగు. సోషల్సులో బాగుండదు. ఇలాటివి అక్కడ రాసేవు. ఒద్దంటారు జాగర్త.... నీకు ఛాన్సు రాగానే నాకు టెలిగ్రాం ఇస్తావుగా. వస్తాను" అన్నాడు ముత్యం.

"తప్పకుండా నిన్ను — నా ప్రాణమిత్రుడిని —" అన్నాడు రాజు గద్గద స్వరంతో.

ఈ ఘట్టంలో కదలొచ్చునో, కూడదో తేల్చుకొలేక ఒక్క క్షణం తటపటాయించి, తనుకూడా బొంగురు గొంతుకతో మూలిగి, ముందుకు నడిచింది రైలు.